ప్రజాశక్తి
ఆదివారం 19 జనవరి 2025 5 విజయనగరం



అమిత్‌షా రాకను వ్యతిరేకిస్తూ
నేడు నిరసనలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లా అంతటా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వామపక్షాల ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సిఎం వస్తేనే రహదారి లేదంటే అతుకుల బొంతే మరి



గజపతినగరం మండలం పురిటిపెంటలో అధ్వానంగా తయారైన రహదారి

ఔను...! సిఎం వస్తేనే రహదారిలో గుంతలు పూడ్చివేత.. లేదంటే అతుకుల బొంతలే. ఇందుకు మంత్రి ఇలాకాలోని గజపతినగరం - మెంటాడ రహదారి నిలువెత్తు నిదర్శనం. ఈ ఒక్కటే కాదు సుమారు గత నవంబరులో అట్టహాసంగా చేపట్టిన రహదారి గుంతల పూడ్చివేత కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. దీంతో, సంక్రాంతి సమయంలో సొంతూళ్లకు వెళ్లే వారంతా నానా తంటాలు పడాల్సిన దుస్థితి దాపురించింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, అంతర్‌జిల్లా, రాష్ట్ర రహదారుల పూడ్చివేత పనుల శంకుస్థాపన కార్యక్రమానికి గత నవంబరు 2న సిఎం రాక నేపథ్యంలో ఎంతో హడావుడిచేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొత్తం 884 కిలో మీటర్ల పరిధిలోని 176 పనులకు రూ.23.54కోట్ల మేర కేటాయించినట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు 296 కిలోమీటర్ల పరిధిలోనే గుంతలు పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. 68 పనులకు రూ.10.54కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సంగతి కాస్త పక్కనబెడితే.. గుంతల పూడ్చివేత పనుల ప్రారంభోత్సవానికి చేసినంత హడావుడి, వాటిని పూడ్చేందుకు మాత్రం చూపలేదు. గజపతినగరం - మెంటాడ రహదారి ఇందుకు సాక్షీ భూతం. గత ఏడాది నవంబర్ 2న పాట్ హోల్ ఫ్రీ రహదారులే లక్ష్యంగా సుమారు రూ.826 కోట్ల రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న రహదారుల మరమ్మతు పనులను ముఖ్యమంత్రితో ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయం చేసింది. ఇందులో భాగంగా గజపతినగరం నుంచి మెంటాడ రహదారిలో సుమారు 6 కిలోమీటర్ల మేర రూ.37 లక్షలతో తలపెట్టిన రహదారి పనులకు సంబంధించి గజపతినగరం మండలం పురిటిపెంట వద్ద రహదారి మరమ్మతు పనులను శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. గంగచోళ్లపెంట గ్రామం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం చేసిన హడావుడి, ఖర్చు ఇంతా అంతా కాదు. దాదాపు రూ.కోటి ఖర్చు అయింది. తీరా, ముందు రోజు రాత్రికే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సిఎం పర్యటన అనివార్యంగా రద్దు అయ్యింది. అయితే సిఎంతో ప్రారంభించేందుకు తలపెట్టిన రహదారి రమ్మతుపనులు నేటికీ పూర్తిచేయకపోవడం ఒకింత విస్మయానికి గురిచేస్తోంది. దీంతో, ప్రజలు కూడా సిఎం వస్తేనే రహదారులు బాగుచేస్తారా? లేదంటే వదిలేస్తారా? అంటూ పెదవి విరిస్తున్నారు. గజపతినగరం, మెంటాడ మండలాల్లో వందల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారి అత్యంత అధ్వాన్నంగా ఉంది. గజానికి గొయ్యి. అడుక్కో గుంత అన్న చందాన ఉంది. గజపతినగరం నుంచి మెంటాడ వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే గోతుల్లో మోకాలు లోతు నీరు చేరి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. వేసవి రోజుల్లో వాహనాల రాకపోకలతో దుమ్ము రేగి తీవ్ర అస్వస్థత గురవుతున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత నియోజకవర్గ కేంద్రంలోనే ఇలా ఉండటంతో జిల్లాలో ఇంకెలా ఉందో అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లాలోని రహదారులు కూడా ప్రజల విమర్శలకు తగ్గట్టే ఉన్నాయి.



వంగర మండలం బాగెంపేటకు వెళ్లే రహదారిని బాగుచేయాలని డ్రోన్ ద్వారా ప్లకార్డు ప్రదర్శిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

మంత్రి ఇలాకాలోనూ ఇదే దుస్థితి

గత నెలలో కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. కొన్ని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారుల గుండా ప్రయాణించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చీపురుపల్లి, వేపాడ, మెరకముడిదాం, గజపతినగరం మండలాల్లో ఈ దుస్థితి నెలకొంది. సంతకవిటి మండల కేంద్రం సంతకవిటి నుంచి కొండగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉండడంతో సంతకవిటి నుంచి శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, కొండగూడెం మీదుగా పాలకొండకు వెళ్లడానికి ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. ఈ రహదారికి 30 ఏళ్ళ గడిచినప్పటికీ ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. వంగర మండలంలోని భాగెంపేట నుంచి నీలయ్యవలస మీదుగా కొండవలస సెంటర్ వరకు ఉన్న రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. సుమారు పది గ్రామాలకు వెళ్లే రోడ్డంతా అధ్వాన్నంగా తయారైంది. రోడ్డు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవలే ఆ గ్రామస్తులు రోడ్డు బాగుచేయాలని డ్రోన్ ద్వారా ప్లకార్డు ప్రదర్శించి, నిరసన తెలిపారు. భోగాపురం మండలంలో గూడెపువలస నుంచి రెడ్డికంచేరు వరకు వెళ్లే వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గూడెపువలసలో మరి దారుణంగా తయారైంది. ప్రధానంగా ఈ రహదారిలో విమానాశ్రయానికి సంబంధించిన భారీ వాహనాలు వెళ్లడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం తలపెట్టిన రహదారులకు సొగసైన రోడ్ల మరమ్మతులు కూడా పూర్తికాలేదు. దీంతో, పండగ పూట అత్తారిళ్లకు వెళ్లిన అల్లుళ్లకు రహదారి పొడవునా గుంతలు స్వాగతం పలికాయి. వాటిని తప్పించుకునే గూటు విరుచుకుని వెళ్లినా కొందరైతే, ఒకగోతిని తప్పించబోయి మరో గోతులోపడినవారు మరికొందరు. ఓహో ఇదేనా సర్కారు వారి గుంతల బాగోతం అంటూ జనం చర్చించుకుంటున్నారు.



లారీని ఢీకొన్న బస్సు



బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

మధుపాడ వద్ద
ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రయివేటు బస్సు
- తండ్రీ కుమార్తె మృతి.. 15 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గజపతినగరం



మృతిచెందిన మోహిత, శుభ్రతోరాయ్



మండలంలోని మధుపాడ గ్రామ సమీపంలోని 26వ నెంబర్ జాతీయ రహదారి వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రి, కూతురు అక్కడికక్కడే మతి చెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని మల్కాజ్‌గిరి నుంచి అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీకి చెందిన బస్సులో 40 మందిని ఫ్రీ మెడికల్ క్యాంపు కోసం విశాఖ జిల్లా తగరపువలస వద్దగల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలిస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు ఉదయం 6గంటల సమయంలో మధుపాడ పాలధార చెరువు వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న తండ్రీ కూతుళ్లు శుభ్రతోరాయ్(35), మోహితరాయ్(3) అక్కడికక్కడే మృతి చెందారు. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న 108వాహన సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను అతికష్టంపై బయటకు గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం తగరపువలసలోని అనిట్స్ మెడికల్ కాలేజీకి తరలించారు. మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సు కొంత భాగం లారీ తొట్టిలోకి దూసుకుపోవడంతో జెసిబి సహాయంతో బయటకు తీశారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ఎస్ఐ కె.లక్ష్మణరావు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 నుంచి పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పశువుల ఆరోగ్యానికి, వాటిలో ఉత్పాదకతను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం జనవరి 20 నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని, రైతులంతా ఈ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సూచించారు. ఈశిబిరాల్లో పశువైద్యులు అందించే సేవలను వినియోగించుకొని పాల దిగుబడి పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జనవరి 20 నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ శనివారం తన ఛాంబరులో ఆవిష్కరించారు. శిబిరాల్లో పశువైద్య చికిత్సలు నిర్వహించడంతోపాటు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ వై.వి.రమణ తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- 86.81 శాతం హాజరు నమోదు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 6198 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 5381 మంది హాజరయ్యారు. 817 మంది గైర్హాజరయ్యారని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని తెలిపారు.

ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు కృషి

కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అశోక్, అదితి, నాయకులు

తెలుగు ప్రజల కీర్తిని దశ దిశలా చాటిచెప్పిన ఎన్‌టి రామారావు ఆశయ సాధనకు కృషి చేస్తామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోట జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ తెలుగుజాతికి ఎనలేని కీర్తి తెచ్చి పెట్టిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టిడిపిని స్థాపించి ఏడాదిలోనే అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్‌టిఆర్‌ది అన్నారు. మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రిజర్వేషన్ తీసుకువచ్చిన నాయకుడని కొనియాడారు. విద్యలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు అధిక ప్రాధాన్యత కల్పించిన నాయకుడన్నారు. గత ఐదేళ్లలో గత ప్రభుత్వం చేసిన విధ్వంసకరం ఎప్పుడూ చూడలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. అనంతరం ట్రిబుల్‌ఐటిలో ర్యాంకులు సాధించిన గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి గంటా పోలినాయుడు, మహిళా పార్లమెంట్ టిడిపి కార్యదర్శి అనురాధ బేగం, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కనకమహలక్ష్మి, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, నియోజకవర్గ టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన...

పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంవద్ద వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అడబాల వెంకటేష్ నాయుడు, ఎంటి రాజేష్ , రంగూరి భరత్ , ఎమ్ .పవన్ కుమార్, గొల్లపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధన మన బాధ్యత

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- నగరంలో పెద్దఎత్తున పారిశుధ్య కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్‌పి కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్



చీపురుతో రోడ్డు శుభ్రం చేస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇది మన బాధ్యతగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. స్వఛ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని కోట జంక్షన్ వద్ద శనివారం నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్ఎ అదితి గజపతిరాజుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. చీపుళ్లతో రోడ్లను శుభ్రం చేశారు. అంతకుముందు కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కోట జంక్షన్ వద్ద మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని మొత్తం 777 గ్రామ పంచాయతీలు,అన్ని మున్సిపల్ వార్డుల్లో వివిధ వర్గాల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇకనుంచీ ప్రతీ నెలా ఒక కొత్త అంశంతో 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రజలంతా స్వచ్ఛందంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కరోనా లాంటి చేదు జ్ఞాపకాలను స్ఫురణకు తెచ్చుకొని ఆరోగ్యకర సమాజాన్ని సాధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంఎల్ఎ అదితి గజపతిరాజు మాట్లాడుతూ, మన అలవాట్లు, సంప్రదాయంలోనే పరిశరాల పరిశుభ్రత ఇమిడి ఉందని అన్నారు. మంచి ఆరోగ్యం, పరిశుభ్రమైన నీరు మనకు అందాలని అన్నారు. రాష్ట్ర తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ, రేపటి తరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నది ఈ కార్యక్రమం వెనుక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, డిపిఒ టి.వెంకటేశ్వరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత, బిసి సంక్షేమాధికారి పెంటోజీరావు, డిపిఆర్ఒ డి.రమేష్, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సిఇఒ రామన్, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరావు, రెడ్ క్రాస్ ఛైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో..

పరిసరాల పరిశుభ్రతను కూడా ప్రతి ఒక్కరూ పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంఇ టి.రాయల్ బాబు, ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి, పాల్గొన్నారు.

విద్యుత్ భవనంలో స్వచ్ఛ దివస్

దాసన్నపేట విద్యుత్ భవనంలో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన కార్యక్రమం జరిగింది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఎనర్జీ కన్జర్వేషన్ మెథడ్స్ పాటించడం, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ అండ్ ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిజియం కె.వి. లక్ష్మీనారాయణ, ఎస్ఎఒ వి.రాంబాబు, ఇఇలు జి.సురేష్ బాబు, పి.త్రినాధ్, కె.వి.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో పరిశుభ్రత కార్యక్రమాలు

విజయనగరంకోట : కలెక్టరేట్ లో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ గా తీర్చుదిద్దడానికి కృషి చేస్తామని అన్ని శాఖల అధికారులు సిబ్బందితో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ పరిధిలోని కార్యాలయాలను ఆయా శాఖల అధికారులు సిబ్బంది చీపుర్లు పట్టి శుభ్రం చేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ కీర్తి, సిపిఒ బాలాజీ, డ్వామా పీడీ శారదా దేవి, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎస్ఒ మధుసూదనరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు తారకరామారావు, జమదగ్ని పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలి

పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని డిఎంహెచ్ఒ జీవనరాణి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం పరిసరాలను సిబ్బంది కలిసి పరిశుభ్రం చేశారు. ముందుగా సిబ్బందితో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఎల్ఎటిఒ డాక్టర్ కె.రాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అచ్చుత కుమారి, పిఒఎన్‌సిడి డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెమో వి.చిన్న తల్లి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

370 మంది అర్హత

ప్రజాశక్తి-విజయనగరంకోట

కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు నిర్వహిస్తున్న దేహ దారుఢ్య పరీక్షల్లో 13వరోజు శనివారం 370 మంది ఎంపికయ్యారు. 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 517 మంది మాత్రమే హాజరయ్యారు. వీరికి పిఎంటి, పిఇటి పరీక్షలు నిర్వహించగా వారిలో 370మంది అర్హత సాధించి తుడి పరీక్షకు ఎంపికయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియను ఎస్‌పి వకుల్ జిందాల్, అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.

ఆస్తి పన్ను చెల్లించకపోతే కరెంట్ కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థకు ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి ఛార్జీలు మార్చి 31లోగా చెల్లించకపోతే వారి ఇళ్లకు విద్యుత్తు సరఫరా కట్ చేస్తామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. బకాయిపడిన మొత్తాన్ని నగరపాలక సంస్థ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన కౌంటర్ నందు వెంటనే చెల్లించాలని కోరారు. పన్నులు కట్టకపోతే ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థ చట్టం 1955 ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆస్తిపన్ను బకాయిదారుల ఎలక్ట్రిసిటీ కనెక్షన్ డిస్ కనెక్ట్ చేయాలని విద్యుత్తుశాఖ ఎస్ఇకి సిఫార్సు చేస్తామని తెలిపారు.

రైతుల గోడు ఎంపీలకు వినిపించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


రైతుల గోడు ఎంపీలకు వినిపించేనా? లేక తెలియనట్టు నటిస్తారా? అన్న చర్చ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సర్వత్రా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఎపికి ప్రత్యేక హోదా మొదలుకుని విభజన చట్టంలోని అనేక హామీలు అమలు కాకపోవడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా మన జిల్లాయే ఎక్కువగా నష్టపోయింది. గిరిజన వర్సిటీ భవన సముదాయం కల ఇప్పటికీ నెరవేర్చకపోవడంతో పరాయి పంచనా, అందునా కంటైనర్‌లోనూ నడుస్తోంది. వెనుక బడిన జిల్లాకు ఇస్తామన్న ప్యాకేజీ మిగిలిన జిల్లాలతో పాటు మనకూ కేంద్రం ఎగ్గొట్టింది. ఇలా గడిచిన పదేళ్లుగా కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రభుత్వం జిల్లాను నిర్లక్ష్యానికి గురిచేసింది. ఈ సంగతి కాస్త అటుంచితే, తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ నుంచి గల్లీ వరకు రైతులు ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌పై ప్రవేశపెట్టిన జాతీయ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, అందుకోసం ఢిల్లీలో దీక్షలు చేస్తున్న రైతు నాయకుల ప్రాణాలను పరిరక్షించాలని సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం) పోరాడుతున్న సంగతి తెలిసిందే. వీరికి మద్దతుగా ఇటీవల విజయవాడలో జరిగిన ధర్నాలో మన జిల్లాకు చెందిన రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఆయా డిమాండ్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రైతు భరోసా పేరిట రూ.13,500 వేలు ఇవ్వగా, తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామంటూ టిడిపి కూటమి ప్రకటించింది. దీన్ని గడిచిన ఖరీఫ్ సీజనల్‌లో కూడా అమలు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు విత్తనాలు మొదలుకుని పురుగులు, ఎరువుల ధరలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా మార్చాయి. రైతులు అప్పుల పాలయ్యారు. మరోవైపు వరి, మొక్కజొన్న, చెరకు, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం మొక్కుబడిగానే పెంచారు. ఆపై ధర అమలులో దగా, తూకంలో మోసం యథాతథంగానే సాగింది. ఇది చాలదన్నట్టు బీమా ప్రీమియాన్ని కూడా రైతులపైకే నెట్టారు.



మన జిల్లాలో వరి, పెసలు, మినుములు, మొక్కజొన్న పంటలకు మాత్రమే బీమా సదుపాయాన్ని వర్తింపజేశారు. ఎకరా వరికి రూ.630, మొక్కజొన్నకు రూ.540, మినుములు పెసలు రూ.300 చొప్పున ప్రీమియం విధించారు. మునుపెన్నడూ లేనంతగా ప్రీమియం విధించారని, ఈ భారాన్ని ప్రభుత్వమే మోయాలని, తాము ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం తమకు చేసేదేముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు పెరిగిన పెట్టుబడులు, పెరగని వ్యవసాయ ఉత్పత్తుల ధరల వల్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిన నేపథ్యంలో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని కర్షకులు డిమాండ్ చేస్తున్నారు. ఎరువుల ధరలు కూడా తగ్గించకపోతే వ్యవసాయం చేసే పరిస్థితులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 80 వేల నుంచి 90 వేల వరకు కౌలు రైతులు ఉండగా, ప్రభుత్వం కేవలం 16వేల మందికే గుర్తింపు కార్డులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వాలని, వీటిపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరుతున్నారు. భూ యజమానుల సంతకాలతో లింకు పెట్టడం వల్ల రుణాలకు నోచుకోలేకపోతున్నామని రైతులు చర్చించుకుంటున్నారు. పాలు, ధాన్యం విక్రయాలపై బోనస్‌కు నోచుకోలేకపోతున్నామని రైతుల ఆవేదన. ఈ నేపథ్యంలో పాల రైతులకు రూ.5, ధాన్యం రైతులకు రూ.500 చొప్పున బోనస్ కోరుతున్నారు. పంటల బీమా సొమ్మును రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలని కూడా కోరుతున్నారు. రైతులు పండించే అన్ని పంటలకు సి 2 ప్లస్ 50 శాతం ఫార్ములా ప్రకారం మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులకు తగినంతగా కేటాయించాలని కూడా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నేడు (ఈ నెల 19న) కార్మిక, కర్షక ఐక్యతా దినంగా పాటిస్తూ బొబ్బిలి, ఎస్.కోట పట్టణాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారు. 20న విజయనగరం, అరకు జిల్లాలకు చెందిన ఎంపీల ఇళ్లు, లేదా కార్యాలయాలను ముట్టడించేందుకు రైతులు, రైతు సంఘం నాయకులు సన్నద్ధమౌతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, అరకు ఎంపీలకు రైతుల గోడు వినిపిస్తుందో? లేదో? అంటూ జనం చర్చించుకుంటున్నారు.

టిటిపిఆర్ ఎస్‌ఇగా స్వర్ణకుమార్

ప్రజాశక్తి- విజయనగరం



సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్ట్ పర్యవేక్షక ఇంజనీర్ గా కెవి ఎన్ స్వర్ణ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టుకు కూడా ఆయన ఎస్‌ఇగా వ్యవహరిస్తారు. ఇప్పటి వరకు ఆయన శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు ఎస్‌ఇగా చేశారు. ఈ మేరకు ఆయన విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. బొబ్బిలి సర్కిల్ జల వనరుల శాఖ ఎస్‌ఇగా ఆర్.అప్పారావు నియమితులయ్యారు.

లెప్రసీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. జీవన రాణి శనివారం తమ కార్యాలయం వద్ద లెప్రసీ గుర్తింపు కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి నిర్వహించే లెప్రసీ స్క్రీనింగ్ పరీక్షలకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ కె రాణి, డాక్టర్ కె.అచ్యుత కుమారి తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ జీవనరాణి శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒపి, ఫార్మసీ, వ్యాక్సిన్ నిల్వ, ల్యాబ్ టెస్టులు నిర్వహించే విధానం తదితర వాటిపై తనిఖీచేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. గర్భిణులకు అందుతున్న సేవలు, డెలివరీలు, తదితర వాటిపై సమీక్ష చేశారు. వైద్య సిబ్బంది పనితీరు ఇంకా మెరుగు పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు సత్యనారాయణ, సమీర, సిసి చంద్రశేఖరరావు, సూపర్‌వైజర్ సూరి అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల సదనాల సందర్శన

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని బాల సదనాల (చిల్డ్రన్ హోం)ను జిల్లా పర్యవేక్షణ కమిటీ శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో శ్రేష్ఠ హోయిగా చిల్డ్రన్ హోంలను సందర్శించి, రికార్డుల నిర్వహణను కమిటీ పరిశీలించింది. పిల్లలకు మౌలిక వసతుల కల్పన, విధి నిర్వహణ, తదితర అంశాలను తనిఖీ చేసింది. ఈ కార్యక్రమంలో డిడిఒ డి.సత్యనారాయణ, డిసిపిఒ బి.రామకోటి, పిఒ లక్ష్మి, ఎసిడిపిఒ బి.లక్ష్మీబాయి, నాగరాజు పాల్గొన్నారు.



బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ పి.నరేష్

సతివాడలో యూనియన్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను శనివారం ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.నరేష్ ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం ప్రాంతీయ కార్యాలయం తమ 71వ శాఖను సతివాడలో ప్రారంభించిందన్నారు. యూనియన్ బ్యాంకు ఖాతా దారులకు అనువైన అనేక డిపాజిట్, ఋణ పథకాలను అందిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు బెనర్జీ, ఎ.రమణ, గ్రామస్తులు, ఖాతాదారులు, బ్రాంచి మేనేజర్ పి. భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసితో భరోసా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎల్ఐసితో ప్రజలకు ఎంతో భరోసా లభిస్తుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ శృంగవరపుకోట బేస్ యూనిట్ కార్యదర్శి వర్రెప్రసాద్ తెలిపారు. ఈ నెల 20న ఎల్ఐసి జాతీయకరణ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలకు ఎల్ఐసి ఆర్థిక భద్రత అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట బ్రాంచ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులంటే సర్కారుకు మక్కువ

బొబ్బిలి: సామాన్యులకంటే మందుబాబులపై సర్కారు మక్కువ చూపుతోందని, అందుకు ఇటీవల జరిగిన మద్యం విక్రయాలే నిదర్శనమని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు విమర్శించారు. మద్యం ధరలు తగ్గింపు, నాణ్యమైన మద్యం పేరుతో ఊదరగొట్టడం వల్ల విక్రయాలు పెరిగాయని చెప్పారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఉచితంగా విద్య వైద్యం అందించాలని, యువతకు ఉపాధి కల్పించాలని గుర్తుచేశారు. వాటిని పక్కనపెట్టి, హామీ ఇచ్చాం కదా.. అని మద్యం ధరలు తగ్గించి అమ్మకాలు పెంచడం వల్ల చిన్న వయసులోనే యువత మద్యానికి బానిసలుగా మారి, సమాజంలో అసాంఘిక శక్తులుగా ఎదుగుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది మంచి పరిణామం కాదని, దీనివల్ల భవిష్యత్తు తరాలు నష్టపోతాయని తెలిపారు. తక్కువ ధరకు మద్యం కావాలా? లేక తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందించే ఏర్పాటు కావాలా? ఒకసారి ఆలోచించాలని కోరారు.

ఆకట్టుకున్న కోలాటం

వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేటలో ముత్యాలమ్మ జాతర సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు

వేపాడ : కొండగుడ్ల బ్రహ్మ లింగేశ్వర ఆలయం వద్ద జిల్లా పరిషత్తు నిధులతో శనివారం బోరు ఏర్పాటు చేశారు. జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు ఈ తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న స్టార్ రూమ్స్ హోటల్లో విశాఖపట్నంలోని విమాననగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం హోటల్ సిబ్బంది గమనించి, కొత్తవలస పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిఐ షణ్ముఖరావు.. మృతుడి వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ఎస్.కోట సిహెచ్‌సికి తరలించారు.

మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్‌పై కేసు నమోదు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ షేక్ మదీనా పై పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. మదీనా జనసేన పార్టీలో కొనసాగుతున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యన్నారాయణను దూషిస్తూ సామాజిక మాధ్యమైన ఫేస్ బుక్‌లో పెట్టా రు. దీనిపై సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సిఐ ఎన్‌వి ప్రభాకర్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శృంగవరపుకోట.. ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలమని బుడా చైర్మన్ తెంటు రాజా అన్నారు. బొబ్బిలి పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ మానవహారం చేశారు. రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

బొబ్బిలిరూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ పి.రవికుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.భాస్కరరావు, హౌసింగ్ ఎఇ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వేపాడ : వేపాడలో ఎంపిడిఒ సూర్యనారాయణ ఆధ్వర్యాన స్వచ్ఛ దివస్ ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోనూ ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సిలో వైద్యులు ఇ.గోపాలకృష్ణ, సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్‌వి పద్మావతి, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎల్‌టి సంతోష్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్వచ్ఛతతోనే ఆరోగ్యం ఆనందం కలుగుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణంలోని దేవి కూడలిలో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు ఆధ్వర్యాన శ్రమదానం చేశారు. తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో తహశీల్దార్ ప్రసాదరావు, మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కె.పార్వతి, కార్యదర్శి దాసరి జానకి స్వరూపి ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

తెర్లాం : తెర్లాంలో ఎంపిడిఒ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.



ప్రతిజ్ఞ చేస్తున్న బుడా చైర్మన్ రాజా, నాయకులు, అధికారులు

కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథరావు, ఎపిఒ సుశీల, ఎఒ సునీల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని ఒమ్మి, రామతీర్థం, నగర పంచాయతీలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు ఒమ్మిలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ కె.అప్పలరాజు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



డెంకాడ.. ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, నాయకులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంది చంద్రశేఖర్, ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపిడిఒ జి.భాస్కరరావు తెలిపారు. శనివారం మండలంలో గర్భాం మేజర్ పంచాయతీలో మానవహారం, ప్రతిజ్ఞ, మాస్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఉప సర్పంచ్, తాడ్డి సత్యం నాయుడు, ఎంఇఒ చంద్రశేఖర్, ఉపాధి హామీ అధికారి నరేంద్ర కుమార్, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రాజాం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పారిశుధ్యం మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సోదరుడు, టిడిపి సీనియర్ నాయకులు కోండ్రు జగదీష్ తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం నుంచి బొబ్బిలి సెంటర్ వరకు ర్యాలీ చేసి పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంల్లో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ఎంపిడిఒ కార్యాలయం వద్ద తహశీల్దార్ గోవింద్ ఆధ్వర్యాన మానవహారం ఏర్పాటుచేసి, ప్రతిజ్ఞ చేశారు. ఎంపిపి ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.



తెర్లాంలో మానవహారం, వేపాడలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సిబ్బంది

టిడిపి ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి వేడుకలను శనివారం రామతీర్థం జంక్షన్, మొయిద జంక్షన్, జరజాపుపేటలో నిర్వహించి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, రాష్ట్ర పరిశీలకులు, సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ రామతీర్థం కూడలిలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికారి ప్రతినిధి గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, పోతల రాజప్పన్న పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చింతలవలసలో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకునివెళ్తూ ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

చీపురుపల్లి: ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావుతో కలసి ప్రస్తుత ఎమ్మెల్యే కళా వెంకటరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కళావెంకటరావు ప్రారంభించారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రక్తదాన శిబిరం

మెంటాడ : ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా మెంటాడలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, సీనియర్ నాయకులు గెద్ద అన్నవరం, గొర్లె ముసలినాయుడు, రాయిపిల్లి గౌరి తదితరులు ఎన్‌టిఆర్‌కు నివాళు లర్పించారు.

వేపాడ : వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేపాడ పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల రమణ, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్ పాల్గొన్నారు.

పూసపాటిరేగ : పూసపాటిరేగలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి సన్యాసినాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు, పతివాడ అప్పలనాయుడు, చందక ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.




నెల్లిమర్ల: రక్తదాతకు ధ్రువ పత్రాన్నిస్తున్న టిడిపి నాయకులు

తెర్లాం : మండలంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు ఎం.వెంకటనాయుడు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి సింహాచలం, ఎంపిటిసి జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే శంబంగి నివాళి

బొబ్బిలిరూరల్ : మండలంలోని పక్కి గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్‌నాయుడు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.









వేపాడలో నివాళులర్పిస్తున్న గొంప వెంకటరావు, నాయకులు ; చీపురుపల్లిలో అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు ; మెంటాడలో నివాళులర్పిస్తున్న చలుమూరి వెంకటరావు, నాయకులు ; బొబ్బిలి మండలం పక్కిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

'లక్ష్మీనరసింహా'లో బ్లాక్ టికెట్ల దందా

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని శ్రీలక్ష్మీనరసింహా థియేటర్‌లో యాజమాన్యం బ్లాక్ టికెట్ల దందా సాగిస్తూ అడ్డంగా దొరికిపోయింది. శనివారం ఆ థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లిన ప్రేక్షకులకు టిక్కెట్లు లేవని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ప్రేక్షకులు తహశీల్దార్ బి.నీలకంఠరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన స్థానిక విఆర్‌ఒ రాధాకృష్ణతో కలిసి థియేటర్‌లో తనిఖీ చేశారు. బ్లాక్ టిక్కెట్లు అమ్ముతున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సినిమా హాల్లోని కంప్యూటర్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చార్ట్‌ను పరిశీలించగా ఇంకా టికెట్లు ఉన్నాయని చూపించడంతో ఆయన ఆశ్చర్యపోయారు. ప్రేక్షకులను అడగ్గా యాప్‌లో సోల్డ్ అవుట్ చూపిస్తోందని తహశీల్దార్‌కు తెలిపారు. రెండు గంటలపాటు క్యూలో నిలబడాల్సి వచ్చిందని ప్రేక్షకులు వాపోయారు. థియేటర్‌లోని క్యాంటీన్‌లో అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో క్యాంటీన్ వద్దకు కలెక్టర్ చేరుకునే సమయానికి అక్కడ ఎవరూ లేరు. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతో తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. లక్ష్మీ నరసింహ థియేటర్ యాజమాన్యంపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుష్టు వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు డాక్టర్ చలమయ్య, రీనా చౌదరి, చందక అసిరి నాయుడు, ఆధ్వర్యంలో కుష్టి వ్యాధి నిర్మూలనపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 వరకు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై ప్రతి గ్రామంలో సర్వే నిర్వహిస్తామన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, నొప్పిలేని బుడిపెలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, కాళ్లు చేతులు తిమ్మిర్లు తదితర లక్షణాలు ఉన్న వారు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు వ్యాధి మందులు పూర్తిగా ఉచితంగా లభిస్తాయని, మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే ఈవ్యాధి పూర్తిగా నయమవుతుందని సూచించారు. విస్తరణాధికారి రాధాకృష్ణ, పిహెచ్ ఎన్ సావిత్రి, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రచారం


ప్రజాశక్తి-విజయనగరంకోట

మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను యువతకు వివరించి, వారిని మాదక ద్రవ్యాల అలవాటుకు దూరం చేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'సంకల్ప రథం'తో ప్రచారం చేపడుతున్నట్లు వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. డ్రగ్స్ కు అలవాటు ఉన్న వారికి 'సంకల్పం' కార్యక్రమాన్ని మరింత చేరువ చేసి, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంకల్పించి ప్రత్యేకంగా రూపొందించిన 'సంకల్ప రథం'తో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా రన్నారు. ఇందులో సిఐ ఎస్.శ్రీనివాస్ , ఎస్ఐ రామ గణేష్, సిబ్బంది కలిసి శ్రీ చైతన్య డిగ్రీ కాలేజి వద్ద వీడియోలు ప్రదర్శించి విద్యార్థులకు, ప్రజలు, యువతకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి వివరించారు. రహదారి భద్రత, మహిళల భద్రత, సైబరు మోసాలు వివరిస్తూ అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో యువత తమ జీవితాలను నాశనం కోవద్దని సూచించారు. సైబరు మోసాలు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా రీసర్వే : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-తెర్లాం

రీసర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. మండలంలో రీసర్వే పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన పనుకువలసలో శనివారం రైతులకు అవగాహన ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో రైతుల భూములను సక్రమైన పద్ధతిలో చేసి, భూ వివాదాలు లేకుండా చేయనున్నట్లు తెలిపారు. రికార్డు పరంగా ఒడిదొడుకులు లేకుండా సర్వే చేసి రైతులకు అప్పగించాలన్నారు. రీసర్వేకు ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, మండల సర్వేయర్ సాయి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఆర్ఐ కృష్ణమూర్తి నాయుడు, సర్పంచ్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిటిసి బి.శేషగిరిరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

20 నుంచి పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలో ఈ నెల 20 నుంచి 31 వరకు పశువులకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి పశు పోషణ ఖర్చు తగ్గించడానికి అన్ని గ్రామాల్లో పశువైద్యశిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా బొబ్బ వ్యాధుల నివారణకు టీకాలు వేస్తామని చెప్పారు. గోకులం, బహుళ వార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశు బీమా, రాయితీపై ఇన్‌పుట్స్ సరఫరా, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు, సంచార ఆరోగ్య సేవా వాహనాలు వంటి పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. తనతోపాటు భీమాలి పశువైద్యాధికారి ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఈ శిబిరాలు నిర్వహిస్తాయని చెప్పారు.

శృంగవరపుకోట : ఈ నెల 20 నుంచి 31 వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ధర్మవరం పశు వైద్యశాల వైద్యులు గనివాడ హేమ తెలిపారు. రోజుకు రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.